ప్రజాశక్తి
బుధవారం 22 నవంబర్ 2023 | 5 | అనంతపురం

జాగ్రత్తగా పంట నష్టం నమోదు

జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

కరువు పరిస్థితుల నేపథ్యంలో జాగ్రత్తగా పంట నష్టం నమోదును చేపట్టాలని జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం అనంతపురం రూరల్ పరిధిలోని కామారుపల్లి గ్రామంలో పంట నష్టం నమోదును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నష్టం జరిగిన ప్రతి పొలాన్ని సక్రమంగా నమోదు చేయాలన్నారు. పంటనష్టం జరిగిన రైతులు ఎవరూ నష్టపోకుండా వారికి పరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. త్వరలో కేంద్రం బందం పర్యటించే అవకాశం ఉందని, ఇందుకు తగిన ఏర్పాట్లు చెయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జెడి ఉమామహేశ్వరమ్మ, ఏడీఏ ఎం.రవి, వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

దీపం ఉండగానే తోడేద్దాం..!

◆ యథేచ్ఛగా ఇసుక,మట్టి అక్రమ తవ్వకాలు
◆ అధికార పార్టీ నేతలకు కాసులపంట
◆ పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

'దీపముండగానే ఇళ్లు చక్కబెట్టుకోవాలి'... అన్న చందంగా ఉంది అధికారపార్టీ నేతల తీరు. అధికారం ఉండగానే ఇసుక, మట్టిని తోడేసి కాసులు వెనకేసుకోవాలన్న యోచనలోనున్నట్టు కనిపిస్తోంది. సార్వత్రిక ఎన్నికలకు సమయం సమీపిస్తున్న తరుణంలో ఈ తవ్వకాలు మరింత వేగంగా జరుగుతున్నాయి. కొన్ని నెలల్లోనే ఎన్నికలు జరిగితే ఫలితాలు ఎలాగుంటాయో చెప్పలేమనని అధికారంలోనున్నప్పుడే సంపాదించేసుకోవాలన్న ఆత్రుతతో ఉన్నట్టు కనిపిస్తోంది. ఎక్కడ ఇసుక ఉన్నా తోడేస్తున్నారు. దానికి అనుమతులున్నాయా... లేదా అన్నది కూడా సంబంధం లేకుండా జెబిసిలు పెట్టడం ఇసుకను తోడేడం జరుగుతోంది. ఇందులోనూ పోటీలు పడి ఇటీవల సత్యసాయి జిల్లాలో ఇద్దరు నేతలు కొట్టుకునే వరకు వెళ్లడం చర్చనీయాంశం అయిన విషయం తెలిసిందే.

కళ్లముందే తోడేస్తున్నా

అనంతపురం జిల్లాలోని పెద్దపప్పూరు మండల కేంద్రంలో గ్రామం ఆనుకునే పెన్నానది ఉంది. ఈ నది ఎదుటే తహశీల్దారు కార్యాలయం, మండల ప్రజా పరిషత్ కార్యాలయం, కాస్త దూరంగా పోలీసు స్టేషన్లు ఉన్నాయి. ఈ కార్యాలయాలకు ఆనుకునే ఎప్పుడూ ఐదు నుంచి ఆరు ఎక్స్‌వేటర్లు ఉంటాయి. అక్కడి నుంచి అర కిలోమీటర్లు ముందర ఈ వాహనాలు ఇసుకను తోడి టిప్పర్లలో నింపేస్తున్నారు. ఇది ఏదో ఒకటో.. రెండో కాదు... రోజుకు వందల సంఖ్యలో టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా ఇసుక అనుమతుల్లేకుండానే విక్రయాలు సాగుతున్నాయి. అయినా అధికారులు అటువైపు కన్నెత్తి చూడని పరిస్థితులు నెలకొన్నాయి. ఇదిచూసి ఆందోళన చెందిన కింది స్థాయి ఉద్యోగులు సమాచారాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారు చూసీచూడనట్టు ఉంటుండటం గమనార్హం. ఎక్కడైనా ఇసుక అక్రమ రవాణా జరిగితే చర్యలు తీసుకుంటామనే అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం పెద్ద ఎత్తున విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

ఇద్దరు నేతల మధ్య బాహాటంగానే ఘర్షణ

సత్యసాయి జిల్లాలో ముదిగుబ్బ మండలంలో ఇటీవలనే ఇద్దరు నేతల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఒక వాహానాన్ని తగులబెట్టారు. దీనికి ప్రధాన కారణంగా ఇసుక తవ్వకాల్లో పోటీయేనన్న ఆరోపణలున్నాయి. ముందు నుంచి ఒక నాయకుడు ఇసుకను పెద్దఎత్తున ఇక్కడ తవ్వకాలు సాగిస్తుండగా, తాజాగా మరో నాయకుడు తానేం తక్కువ అని రంగంలోకి దిగడంతో ఇద్దరి మధ్య ఆధిపత్యపు పోరు మొదలై ఘర్షణకు దారి తీసింది. అయినా అధికారులు మాత్రం మౌనంగానే ఉండటం గమనార్హం.

కళ్లుమూసుకున్న అధికారులు

అధికార పార్టీ నేతలకు ఆదాయ వనరుగానున్న ఇసుక అక్రమ తవ్వకాలపై చర్యలు తీసుకోవాలంటే అధికారులు కూడా వెనకడుగు వేస్తున్నారు. పట్టుకుంటే ఉన్నత స్థాయి నుంచి ఒత్తిళు వచ్చి, తమపై ఎటువంటి చర్యలుంటాయోనని భయపడుతున్నారన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. దీంతో తెలిసినా తమకెందుకని అటువైపు కన్నెత్తి చూడకుండా ఉంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పెద్దపప్పూరు ఇసుక తవ్వకాలపై తాడిపత్రి మైన్సు అసిస్టెంట్ డైరెక్టరును వివరణ కోరే ప్రయత్నం చేయగా ఆయన అందుబాటులోకి రాలేదు. స్థానిక అధికారుల దృష్టికి తీసుకెళ్లినా మౌనమే సమాధానం రావడం గమనార్హం.

కూలిన వంతెన.. తప్పిన ప్రమాదం.!

◆ ఏళ్లుగా మరమ్మతులకు నోచని గంగులాపురం వంతెన ◆ బాగుచేయడంలో అధికారులు, ప్రజాప్రతినిధుల అలసత్వం

ప్రజశక్తి -కణేకల్లు

కణేకల్లు ప్రాంతం నుంచి గంగలాపురం రచ్చుమర్రి గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారి హెచ్‌ఎల్‌సి కాలువపై నిర్మించిన వంతెన మంగళవారం నాడు కుప్పకూలింది. వరి బస్తాలతో వెళ్తున్న ఐచర్ వాహనం బ్రిడ్జిపైకి రాగానే ఒక్కసారిగా వంతెన కూలిపోయింది. దీంతో ఐచర్ వాహనం వంతెనలో పడిపోయింది. వెంటనే ఐచర్‌లో ఉన్న డ్రైవర్, క్లీనర్‌లు అందులో నుంచి బయటకు వచ్చి ప్రాణాలను కాపాడుకున్నారు. వెంటనే సమీప గ్రామాల రైతులు, కూలీలు స్పందించి లారీలో ఉన్న వరిధాన్యం బస్తాలను ఒక్కొక్కటిగా బయటక తీశారు. కాగా ఈ వంతెనను 1968లో నిర్మించారు. వంతెనపై గంగలాపురం, రచ్చుమర్రి గ్రామస్తులు రాకపోకలు సాగిస్తుంటారు. గత రెండు సంవత్సరాల క్రితం భారీగా కురిసిన వర్షానికి వంతెను పూర్తిగా పాడైపోయింది. ఇది కూలిపోవడానికి సిద్ధంగా ఉందంటూ అధికారులు, నాయకులకు ఆ గ్రామస్తులు పలుమార్లు చెప్పారు. అయినా దీని మరమ్మతు, లేదా ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై వారెవరూ దృష్టి సారించలేదు. గత్యంతర లేక ప్రజలు ప్రమాదం అని తెలిసినా తప్పక దీనిపైనే రాకపోకలు సాగిస్తున్నారు.

భారీ వాహనాలతో ఇసుక అక్రమ రవాణా

రచ్చుమర్రి గ్రామం వద్ద ఉన్న ఇసుక దిబ్బల నుంచి అక్రమ ఇసుక రవాణా భారీగా జరుగుతోంది. ప్రతి రోజూ రాత్రి సమయంలో వందలాది ఇసుక ట్రాక్టర్లు, టిప్పర్లు అధిక టన్నేజీతో ఈ వంతెన పైనుంచే రాకపోకలు సాగిస్తున్నాయి. ప్రతి రోజూ పదుల సంఖ్యలో ఇసుక టిప్పర్లు దీనిపై వెళ్తుంటాయి. చిన్నపాటి వాహనాలు రాకపోకలు సాగించేందుకు ఏర్పాటు చేసిన ఈ బ్రిడ్జిపై అధిక టన్నేజీతో భారీ వాహనాలు నిత్యం వెళ్తున్నా అధికారులెవరూ దీనిని గురించి పట్టించుకోలేదు. ఏ ఒక్క రోజుకూడా వాటిని నియంత్రించే చర్యలు తీసుకోలేదు. దీంతో బ్రిడ్జి మరింత శిథిలావస్థకు చేరుకుంది. ఈ క్రమంలోనే మంగళవారం నాడు అది ఏకంగా కూలిపోయింది. కణేకల్లు నుంచి గంగలాపురంకి మూడు కిలోమీటర్ల దూరం ఉంది. ప్రస్తుతం బ్రిడ్జి కూలిపోవడంతో గంగులాపురం గ్రామానికి వెళ్లాలంటే కొత్తపల్లి, ఆదిగానిపల్లి గ్రామాల మీదుగా 12 కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సిన దుస్థితి నెలకొంది.

వరి రైతులకు ఇబ్బందులు

ప్రస్తుతం వరి కోత సీజన్ మొదలు అయ్యింది. వరికోత మిషన్లు రైతుల పొలాల వద్దకు వెళ్లాల్సి ఉంది. బ్రిడ్జి కూలిపోవడంతో ఈ వాహనాలు 15 కిలోమీటర్లు చుట్టూ తిరిగి రావాల్సిన పరిస్థితి నెలకొంది. రానుపోను 30 కిలోమీటర్ల అదనంగా ప్రయాణించాల్సి వస్తోంది. ఈ అదనపు భారం రైతులపై పడుతోంది. గంగలాపురానికి వెళ్లే ప్రధాన రహదారిపై ఎంతోమంది రైతులు వరి ధాన్యం ఆరబోసి రాసులుగా పెట్టుకునే వారు. ప్రస్తుతం ఆ పరిస్థితి కూడా లేకుండా పోయింది.

వంతెనలో కూలిపోయిన ఐచర్

ఇన్‌ఛార్జి మంత్రి దృష్టికి తీసుకెళ్తా : విప్

కూలిన వంతెనను ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి పరిశీలించారు. వంతెన కూలిపోయిన విషయంపై గ్రామస్తులతో అడిగి తెలుసుకున్నారు. వంతెన కూలిపోయిన విషయాన్ని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డితో మాట్లాడి తక్షణం కొత్త వంతెన నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని విప్ రామచంద్రారెడ్డి తెలియజేశారు. అవసరం అయితే సీఎం క్యాంప్ ఆఫీస్ అధికారులతో కూడా మాట్లాడి పరిష్కారం చూపుతానని రైతులు, గ్రామస్తులకు తెలిపారు.

అధికారులు, పాలకుల నిర్లక్ష్యమే : కాలవ

ప్రజాప్రతినిధుల అసమర్ధత, అధికారుల నిర్లక్ష్యం వల్లే గంగలాపురం వంతెన కూలిపోయిందని మాజీ మంత్రి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు మండిపడ్డారు. కనేకల్లు టిడిపి నాయకులతో కలిసి కూలిపోయిన వంతెనను పరిశీలించారు. ఈ సందర్భంగా కాలవ మాట్లాడుతూ రెండేళ్లుగా వంతెన ప్రమాదకర స్థితిలో ఉన్నా అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోలేదన్నారు. ఎమ్మెల్యే కాపు హెచ్ఎల్సీ కాలువలపైన ఉన్న వంతెనల మరమ్మతులపై దృష్టి సారించాలని కోరారు.

హామీలు నిలుపుకోకపోతే జగన్‌కు గుణపాఠమే

◆ సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు
◆ కలెక్టరేట్ ఎదుట వంటావార్పుతో మున్సిపల్ కార్మికుల ధర్నా
◆ నడిరోడ్డులో భోజనం చేసిన నాయకులు, కార్మికులు

ధర్నాలో ప్రసంగిస్తున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.ఓబులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

మున్సిపల్ కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులను రెగ్యులరైజ్ చేస్తామని, కనీస వేతనాలు చెల్లిస్తామని ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని అమలు చేసి మాట నిలుపుకోకుంటే రాబోవు ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు హెచ్చరించారు. మున్సిపల్ కార్మికులు, ఉద్యోగుల యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట మంగళవారం నాడు మహాధర్నాను నిర్వహించారు. వంటావార్పుతో కార్మికులు పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. రోడ్డుపైనే సిఐటియు నాయకులు, మున్సిపల్ కార్మికులు సహపంక్తి భోజనాలు చేశారు. అంతకుమునుపు సంగమేష్ సర్కిల్ నుంచి కలెక్టరేట్ వరకు నిరసన ప్రదర్శన ర్యాలీ నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కార్మికులు, ఉద్యోగుల యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎటిఎం.నాగరాజు అధ్యక్షతన నిర్వహించిన మహాధర్నాలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్, మున్సిపల్ కార్మికులు, ఉద్యోగుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.నాగభూషణం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఓబులు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు నాలుగున్నర సంవత్సరాలు పూర్తవుతున్న అమలు చేయకపోవడం విచారకరం అన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో వైసిపి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మున్సిపల్ కార్మికులందరినీ దశలవారీగా క్రమబద్ధీకరణ చేస్తామని వాగ్దానం ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. కరోనా లాంటి విపత్కర పరిస్థితుల్లో కూడా తమ ప్రాణాలు సైతం లెక్కచేయకుండా మున్సిపల్ కార్మికులు విధులు నిర్వహించారని గుర్తు చేశారు. పిఎఫ్, ఇఎస్ఐ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు అమలు చేయడంలో ప్రభుత్వం విఫలం అయ్యిందన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్ మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. సిపిస్ రద్దు చేయాలన్నారు. ఇంజినీరింగ్ కార్మికులకు స్కిల్డ్, సెమీ స్కిల్డ్ వేతనంతో పాటు, హెల్త్, రిస్క్ అలవెన్స్‌లు అమలు చేయాలన్నారు. లేని పక్షంలో నిరవధిక సమ్మెలోకి వెళ్లడానికి కూడా వెనకాడబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వెంకటనారాయణ, నగర అధ్యక్షుడు గురురాజు, మున్సిపల్ కార్మికుల యూనియన్ నగర అధ్యక్ష కార్యదర్శులు బండారి ఎర్రిస్వామి, తిరుమలేశు, రాము, తిప్పేస్వామి, రామంజినేయులు, వన్నూరప్ప, నరసింహమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

వాహనాలను పంపిణీ చేస్తున్న జెడ్పీ ఛైర్‌పర్సన్, కలెక్టర్

మత్స్యకారులకు మరింత ప్రోత్సాహం

జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, కలెక్టర్ ఎం.గౌతమి

అనంతపురం కలెక్టరేట్ : మత్స్యకారులకు అవసరమైన మరింత ప్రోత్సాహాన్ని అందించేలా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని జెడ్పీ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ, కలెక్టర్ ఎం.గౌతమి తెలియజేశారు. మంగళవారం నాడు కలెక్టర్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ వద్ద ప్రపంచ మత్స్య దినోత్సవాన్ని పురస్కరించుకుని లబ్ధిదారులకు ద్విచక్ర వాహనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్న పథకాలను మత్స్యకార కుటుంబాలు ఉపయోగించుకోవాలన్నారు. చేపలు తినడం వల్ల వచ్చే ఆరోగ్య ప్రయోజనాలను అందరికీ తెలియజేయాలన్నారు. రైతులు ముందుకు వస్తే మరిన్ని మినీ ఫిష్ ఔట్‌లెట్లను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ మత్స్యకార కుటుంబాలు ఆర్థికంగా మరింత బలోపేతం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ ఎఫ్‌టిఒలు ఆసిఫ్, లక్ష్మీనారాయణ, ఫక్కీరప్ప, పెద్దబాబునాయుడు, మత్స్య శాఖ సిబ్బంది షెహిన్ ఖాన్ పాల్గొన్నారు.

పటిష్టంగా తెలుగుభాష అమలు

ఆంధ్రప్రదేశ్ తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థ అధ్యక్షులు పి.విజయబాబు

సమావేశంలో మాట్లాడుతున్న పి.విజయబాబు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

తెలుగుభాష అమలును పటిష్టంగా చేయాలని ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం, తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థ అధ్యక్షులు పి.విజయబాబు అధికారులకు సూచించారు. అనంతపురం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో అధికారభాషా తెలుగు అమలుపై కలెక్టర్ ఎం.గౌతమితో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిపాలన వ్యవహారాల్లో తెలుగు భాష ఉపయోగించేందుకు ప్రత్యేక జీవోలు తీసుకువచ్చామన్నారు. ప్రభుత్వ జీవో ప్రకారం ఆయా శాఖల అధికారులు ఉత్తర ప్రత్యుత్తరాలు, వ్యవహారాలన్నీ తెలుగులోనే ఉండేలా చూడాలన్నారు. తెలుగు రాష్ట్రం ఉన్నంతవరకు తెలుగు భాషను అమలు చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో తెలుగులోనే బోర్డు ఉండాలని, అవసరమైతే కింద ఇంగ్లీషులో పేరు పెట్టుకోవచ్చన్నారు. కలెక్టర్ ఎం.గౌతమి మాట్లాడుతూ జిల్లాలో తెలుగుభాషలో ఉత్తర ప్రత్యుత్తరాలు అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. సామాన్య ప్రజలకు సంబంధించిన సమస్యలపై తెలుగులోనే సమాధానం ఇస్తున్నామని తెలియజేశారు. ఈ సమావేశంలో డిఆర్‌ఒ గాయత్రి దేవి, ఆర్డీవో గ్రంధి వెంకటేష్, డీపీవో ప్రభాకర్ రావు, నగర పాలక సంస్థ కమిషనర్ భాగ్యలక్ష్మి, డీఆర్డీఏ పీడీ నరసింహారెడ్డి, పీఆర్ ఎస్ఈ భాగ్యరాజ్, డిఎంహెచ్ఒ డా॥ఈబి.దేవి, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ నాగరాజ్, వ్యవసాయ శాఖ జెడి ఉమామహేశ్వరమ్మ, మెప్మా పీడీ విజయలక్ష్మితో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జిల్లా సమగ్ర సాహిత్య మూల్యాంకనంపై చర్చ

అంతకుముందు డిసెంబర్ నెల తొలివారంలో జరగనున్న జిల్లా సమగ్ర సాహిత్య మూల్యాంకనంపై సాహితీవేత్తలతో విజయబాబు చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సాహితీవేత్తలను ఆయన శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా టూరిజం అధికారి నాగేశ్వర్ రెడ్డి, సాహితీవేత్తలు ప్రొ॥ రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి, డా॥శాంతి నారాయణ, రాజారావు, డా॥రమేష్ నారాయణ, రియాజుద్దీన్, శ్యామసుందర శాస్త్రి, గిరిధర్ ప్రసాద్, గుత్తా హరి, కె.మురళి పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్ష కేంద్రం గుట్టురట్టు

సిపిఎం నాయకుల ఫిర్యాదుతో డిఎంహెచ్ఒ తనిఖీ
నిర్వాహకుల అరెస్టు, యంత్రం, రికార్డులు సీజ్

లింగనిర్ధారణ నిర్వాహకులతో మాట్లాడుతున్న డిఎంఅండ్‌హెచ్ఒ దేవి, సిపిఎం, ఐద్వానాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

నగరంలో జనావాసాల నడుమ నిర్వహిస్తున్న లింగ నిర్ధారణ పరీక్ష కేంద్రం గుట్టురట్టయింది. మంగళవారం నగరంలోని ఎర్రనేల కొట్టాలలోని ఓ ఇంట్లో లింగ నిర్ధారణ చేస్తున్నట్లు తెలుసుకున్న సిపిఎం నాయకులు డిఎంహెచ్ఒ ఈబి.దేవికి ఫోన్ ద్వారా సమాచారం అందజేశారు. అలాగే నాల్గవ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు వచ్చి నిర్వాహకులు సురేష్‌కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. తర్వాత డిఎంఅండ్‌హెచ్ఒ తమ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని ఇంట్లోని యంత్రాలను పరిశీలించి లింగనిర్ధారణ పరీక్షల యంత్రంగా నిర్ధారించారు. అనంతరం రోజువారీగా వచ్చే రోగుల వివరాల రిజిస్ట్రార్‌ను పరిశీలించారు. మంగళవారం ఒక్క రోజే నలుగురు మహిళలు పరీక్షలు చేయించుకున్నట్లు గుర్తించారు. దీంతో లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్న ఇంటిని, యంత్రాలను, రిజిస్ట్రర్‌లను సీజ్ చేశారు. పోలీసులు నిర్వాహకులను అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా డిఎంఅండ్‌హెచ్ఒ ఈబి.దేవి మాట్లాడుతూ ఇక్కడ లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నారని సిపిఎం నగర కార్యదర్శి రామిరెడ్డి ఫిర్యాదు చేయడంతో తనిఖీ చేస్తే రుజువైందన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం చట్టరీత్యా నేరమన్నారు. నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం, ఐద్వా నేతలను అభినందించారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

నగరంలో అనేక ఆసుపత్రుల్లో లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నారని, పరిశీలించి వారిపై చర్యలు తీసుకోవాలని సిపిఎం నగర 1వ కమిటీ కార్యదర్శి వి.రామిరెడ్డి, ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి డిమాండ్ చేశారు. ఎర్రనేల కొట్టాలలో లింగ నిర్ధారణ పరీక్ష కేంద్రం వద్ద విలేకరులతో మాట్లాడుతూ విచ్చలవిడిగా మహిళల పట్ల స్కానింగ్ సెంటర్లు, ప్రయివేట్ ఆసుపత్రులు లింగ నిర్ధారణల పేరుతో దోపిడీలు చేస్తున్నాయని తెలిపారు. ఎర్రనేల కొట్టాలో ఎలాంటి అనుమతులు లేకుండా చదువు అర్హతలు లేకున్నా సురేష్ కుమార్ అనే వ్యక్తి రోజుకు పదుల సంఖ్యలో మహిళలకు లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తూ రూ.వేలు అక్రమంగా సంపాదిస్తున్నారని విమర్శించారు. ప్రజల ప్రాణాలతో ఆడుకుంటున్నారని మండిపడ్డారు. సిపిఎం ఆధ్వర్యంలో స్టింగ్ ఆపరేషన్ ద్వారా స్కానింగ్ చేస్తున్న వారిని, పరికరాలను, డిఎంహెచ్ఒ, రెవెన్యూ అధికారులు, పోలీసులకు పట్టించామన్నారు. వైద్య ఆరోగ్యశాఖ వారు నిర్లక్ష్యంతో ఇలాంటి వారు రెచ్చిపోతున్నారని, ఏమాత్రం విద్యా అర్హత లేకున్నా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కేంద్రానికి ఎక్కడి నుంచి పేషెంట్స్ వస్తున్నారో, అలా పంపిస్తున్న ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాలన్నారు. పెద్ద మాఫియాగా నడుస్తోందని, అధికారులు ఇలాంటి మాఫియా పట్ల కఠినంగా వ్యవహరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు పర్వీన్, సిపిఎం నగర నాయకులు వలి, వెంకటేశు, జీవా, ఇస్మాయిల్, ఫక్రూ, నారాయణపురం ఇమామ్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

జీతాలు ఇస్తామన్నారు..చెవిలో పూలు పెట్టారు..

కొనసాగిన గన్నెవారిపల్లి పంచాయతీ కార్మికుల నిరసన

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

'కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తే మంగళవారంలోపు వేతనాలను ఖాతాలకు జమ చేస్తామన్నారు.. ఇవ్వకుండా చెలిలో పూలు పెట్టారు..' అంటూ గన్నెవారిపల్లి పంచాయతీ కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలంటూ మండలంలోని గన్నెవారిపల్లి పంచాయతీ కార్మికులు పది రోజుల నుంచి ఆందోళనలు చేస్తున్న విషయం తెలిసిందే. అందులో భాగంగా ఈనెల 20న కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. దీంతో స్పందించిన జాయింట్ కలెక్టర్ మంగళవారంలోపు వేతనాలు చెల్లిస్తామంటూ హామీ ఇచ్చారు. అయినా కార్మికుల ఖాతాలకు వేతనాలు జమ చేయలేదు. చేసేది లేక తిరిగి మంగళవారం కడప రోడ్డులోని రామాలయం వద్ద చెవులో పూలు పెట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ పెండింగ్ వేతనాలు చెల్లిస్తామని చెప్పి చెల్లించకుండా తమ చెవిలో పూలు పెడతారా.. అంటూ వాపోయారు. ఎన్ని నిరసనలు చేసినా అధికారులు పట్టించుకోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి వేతనాలు చెల్లించాలని, లేనిపక్షంలో సమ్మెకు వెళ్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు హనుమంతురెడ్డి, పంచాయతీ కార్మికులు రాజు, సంధ్యాబాయి, రాణి, రామంజి, తదితరులు పాల్గొన్నారు.

చెవిలో పూలు పెట్టుకుని నిరసన కార్మికులు

అంతర్‌రాష్ట్ర దొంగ సహా ముగ్గురు అరెస్టు

రూ.12 లక్షల విలువజేసే బంగారం స్వాధీనం

స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలను చూపుతున్న ఎస్పీ కెకెఎన్ అన్బురాజన్, రూరల్ డీఎస్పీ శివారెడ్డి

అనంతపురం క్రైం : జిల్లాలో ముగ్గురు దొంగలను అనంతపురం రూరల్, పుట్లూరు, గుంతకల్లు టౌన్ పోలీసులు వేర్వేరుగా అరెస్టు చేసి రూ.12లక్షలు విలువజేసే 23.5 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం స్థానిక పోలీస్ కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ కెకెఎన్ అన్బురాజన్ మాట్లాడుతూ కళ్యాణదుర్గం పట్టణానికి చెందిన పీట్ల గంగాధర్‌ను అనంతపురం రూరల్ పోలీసులు అరెస్టు చేసి ఆరు తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడిపై తెలంగాణ, కర్నాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో 50కి పైగా కేసులు ఉన్నాయన్నారు. నిందితుడు ఇచ్చిన సమాచారం మేరకు మరో ముగ్గురు నిందుతులను అదుపులోకి తీసుకున్నట్లు వివరించారు. అనంతపురం రూరల్ డీఎస్పీ శివారెడ్డి, గుంతకల్లు డీఎస్పీ నరసింగప్ప ఆధ్వర్యంలో వేర్వేరుగా ముగ్గురు దొంగలను అరెస్టు చేసిన గుంతకల్లు వన్ టౌన్ సీఐ రామసుబ్బయ్య, అనంతపురం రూరల్ ఎస్ఐ ప్రవీణ్ కుమార్, పుట్లూరు ఎస్ఐ దిలీప్ కుమార్, సీసీఎస్ ఎస్ఐ నాగరాజు, హెడ్ కానిస్టేబుళ్లు కిష్టప్ప, ప్రకాష్, చంద్రశేఖర్, కానిస్టేబుళు అనిల్, దేవులానాయక్, గౌస్, రాజు, పాండవ, కిషోర్ కుమార్, శివశంకర్, నరేష్‌ను ఎస్పీ అభినందించి రివార్డులు అందజేశారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-నార్పల

నార్పల సిడిపిఓకు సమ్మె నోటీస్ అందజేస్తున్న అంగన్‌వాడీలు

ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని అంగన్‌వాడీ కార్యకర్తలు శ్రీదేవి, రేణుక డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో పర్యవేక్షకురాలు ఉమాదేవికి త్వరలో చేపట్టనున్న సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీల సమస్యలను పరిష్కారం చేయకుండా నిర్లక్ష్యం చేస్తోందన్నారు. ముఖ్యంగా వేతనాల పెంపు, గ్రాట్యూటీ అమలు, తదితర సమస్యలు పరిష్కరించాలని అనేకమార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదన్నారు. ఆయా సమస్యల పరిష్కారం కోసం డిసెంబర్ 8వ తేదీ నుంచి అంగన్‌వాడీలు నిరవధిక సమ్మెలో వెళ్లనున్నట్లు తెలిపారు.

సిమెంట్ రోడ్డు పనుల పరిశీలన

రోడ్డు పనులను పరిశీలిస్తున్న నాయకులు

అనంతపురం కార్పొరేషన్ : నగరంలోని 32 డివిజన్ పరిధిలో రూ.18 లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను మేయర్ మహమ్మద్ వసీం మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ సిఎం జగన్ సహకారంతో నగరంలో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా అంతర్గత రహదారుల అభివృద్ధిపై రూ.25 కోట్లు నిధులు విడుదల చేసినట్లు తెలిపారు. అదేవిధంగా గడప గడపకూ కార్యక్రమంలో ప్రజలు తీసుకొస్తున్న సమస్యల పరిష్కారానికి ఒక్కో సచివాలయానికి రూ.20 లక్షలు వంతున నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ విజయ్‌భాస్కర్‌రెడ్డి, కార్పొరేటర్లు ఏఈ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

టిఎన్‌టియుసి అనంతపురం అధ్యక్షులుగా లక్ష్మీనరసింహులు

అనంతపురం : టిఎన్‌టియుసి అనంతపురం పార్లమెంటు అధ్యక్షులుగా పోతుల లక్ష్మీనరసింహులును నియమిస్తూ టిడిపి అనంతపురం పార్లమెంటు అధ్యక్షులు కాలవ శ్రీనివాసులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా పోతుల లక్ష్మీనరసింహులు మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి టిఎన్‌టియుసి అనంతపురం పార్లమెంటు అధ్యక్షులుగా నియమించిన టిడిపి జిల్లా అధ్యక్షులు కాలవ శ్రీనివాసులు, అనంతపురం అర్బన్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వైకుంఠం ప్రభాకరచౌదరికి కృతజ్ఞతలు తెలిపారు.

26 నుంచి చదరంగం పోటీలు

చదరంగం పోటీల వివరాలను వెల్లడిస్తున్న ఆంధ్రా చెస్ అసోసియేషన్ నాయకులు

అనంతపురం : నగరంలోని కెఎస్ఎన్ డిగ్రీ, పీజీ మహిళా కళాశాల వేదికగా ఆంధ్రా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆల్ అనంతపురం జిల్లా చెస్ అసోసియేషన్ సౌజన్యంతో ఏ.1 చెస్ అకాడమీ నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి స్కూల్స్ ర్యాంకింగ్ చెస్ టోర్నమెంట్‌ను జయప్రదం చేయాలని అసోసియేషన్ ఛైర్మన్ బాలరాజు, అధ్యక్షుడు శివకుమార్, కార్యదర్శి ఉదయ్‌కుమార్ నాయుడు తెలిపారు. ఈమేరకు మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఈ టోర్నమెంట్‌కు ఇప్పటికే 120 మంది క్రీడాకారులు పేర్లు నమోదు చేసుకున్నట్లు తెలిపారు. ప్రతి కేటగిరిలో టాప్-2 క్రీడాకారులకు మొమెంటు, క్రీడాకారులందరికీ ప్రోత్సాహక మెడల్స్, ఉచిత భోజనం సదుపాయాన్ని కల్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ శంకరయ్య, ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాసప్రసాద్, స్పాన్సర్ ఈపూరి రవికుమార్, రాజారెడ్డి, హరి , టోర్నమెంట్ కోఆర్డినేటర్ గోవిందరాజులు, తదితరులు తెలిపారు.

పంట పొలాల పరిశీలన

పంటలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారిణి ఉమామహేశరమ్మ

ఆత్మకూరు : తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో మంగళవారం మండలంలోని వడ్డుపల్లి గ్రామంలో నష్టపోయిన పంట పొలాలను జిల్లా వ్యవసాయ అధికారిణి ఉమామహేశరమ్మ పరిశీలించారు. త్వరలో కరువు బృందం పర్యటన సందర్భంగా మండలంలోని పంట పొలాలను పరిశీలించినట్లు వ్యవసాయ అధికారిణి తెలిపారు. ఈ కార్యక్రమంలో అనంతపురం ఎడిఎ రవి, ఎంపిపి హేమలత, ఎంఎఒ సుచరిత, జెడి కార్యాలయ ఎఒ బాలునాయక్, ఎఇఒ సుజిత, సర్పంచి లక్ష్మీనారాయణరెడ్డి, నరసింహారెడ్డి, వన్నూరప్ప, గోపాల్‌రెడ్డి, ఫణిరెడ్డి, కొండారెడ్డి, పోతన్న, ఆంజనప్ప, వన్నూరప్ప, రైతులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకే విమర్శలు : వైసిపి

ప్రజాశక్తి-ఆత్మకూరు

విలేకరులతో మాట్లాడుతున్న వైసిపి నాయకులు

గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకూ వైసిపి చేసిన అభివృద్ధిని చూసి ఓర్వలేని ప్రతిపక్షాలు లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయని వైసిపి జిల్లా అధికార ప్రతినిధి చంద్రశేఖర్‌రెడ్డి, మండల ఎన్నికల ఇన్‌ఛార్జి సనప గోపాల్‌రెడ్డి, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు జొన్నగిరి బాల పోతన్న, మండల పరిషత్ అధ్యక్షురాలు సుబ్బర హేమలత అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మండలంలోని వడ్డుపల్లి నుంచి మదిగుబ్బ రహదారి, రంగంపేట తగరకుంట రహదారి నిర్మాణం, గొరిదిండ్ల-గొరిదిండ్లతండా రహదారుల టెండర్లను మాజీమంత్రి పరిటాల సునీత్మ వర్గీయులు దక్కించుకోవడంతో పనులు పెండింగ్‌లో ఉంచారన్నారు. దీన్ని సాకుగా చూపి విమర్శలు చేయడం బాధాకరమన్నారు. ఇప్పటికి 60 శాతం పనులు పూర్తి చేశారని, వచ్చే ఎన్నికల లోపు వందశాతం పనులు పూర్తి చేసి టిడిపి నాయకులు తలదించుకునేలా చేస్తామని చేస్తామన్నారు. వీటితోపాటు అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నామన్నారు. ఇవి చూసి ఓర్వలేక లేనిపోని విమర్శలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల యూత్ కన్వీనర్ కొండారెడ్డి, యువనేత యన్నం ఫణిరెడ్డి, సీనియర్ నాయకులు పొక్కుల ఈశ్వర్‌రెడ్డి, షావుకారి అంజినప్ప, ఆత్మకూరు మేజర్ పంచాయతీ సర్పంచి వరలక్ష్మి, సచివాలయ-1 కన్వీనర్ ఓబి, టైలర్ వెంకటేష్, సచివాలయం-2 కన్వీనర్ కంటెన్నగారి వెంకటేశులు, తదితరులు పాల్గొన్నారు.

ROC.No.347/2017/A1&377/2022/A1

గుత్తి పురపాలక సంఘం
తేది:21/11/2023

వేలం ప్రకటన

గుత్తి పురపాలక సంఘమునకు సంబంధించిన ఈ క్రింది కనబరచిన షాపు రూములను లీజుకిచ్చుటకు తేది 25/11/2023 శనివారము ఉదయం 11.00 గం॥లకు మునిసిపల్ కార్యాలయము నందు బహిరంగ వేలము నిర్వహించబడును.

వరుస నెం.	షాపు రూము ప్రాంతము	షాపు రూము నెం.	ధరావతు	సాల్వేన్సు మొత్తము
1	2	3	4	1
1	పాత మున్సిపల్ ఆఫీసు ఎదురుగా ఓల్డ్ షాపులు	1,2,3,4,5,7,8,9,10 (Gerenal)	10,000/-	1,00,000/-
2	పాత మున్సిపల్ ఆఫీసు ఎదురుగా ఓల్డ్ షాపులు	1,2, (SC Reserved)	10,000/-	1,00,000/-
3	APSRTC బస్టాండ్ ఎదురుగా	02 (Gerenal)	10,000/-	1,00,000/-
4	గుత్తి R S చెట్నేపల్లి పాత మున్సిపల్ ఆఫీసు ప్రక్కన	03 (Gerenal)	10,000/-	1,00,000/-
5	గుత్తి R S KNL రోడ్డు నందు	01 (Gerenal)	10,000/-	1,00,000/-

వేలము పాల్గొనదలచిన వారు నోటీఫికేషన్ షరతులకు లోబడి పాల్గొనవచ్చును. ఏ కారణము చూపకనే వేలం రద్దు చేయుటకు లేక వాయిదా వేయుటకు గాని పూర్తి అధికారము కమిషనర్ వారికి అధికారము కలదు. గుత్తి మున్సిపాలిటీ కమిషనర్ వారిచే గానీ మండల తహసీల్దార్ పొందిన సర్టిఫికెట్ సమర్పించవలెను.ఇతర వివరముల కొరకు కార్యాలమయములో పని చేయు వేళలయందు రెవెన్యూ విభాగములో సంప్రదించి తెలుసుకొని బహిరంగ వేలములో పాల్గొనవచ్చును.

కమిషనర్
గుత్తి పురపాలక సంఘం

దాడికి గురైన బాలికకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

నగరంలో నాలుగు రోజుల క్రితం అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఇంటిలో పని చేస్తున్న మైనర్ బాలికపై విచక్షణారహితంగా దాడి చేసిన వారిని శిక్షించి, ఆ బాలికకు న్యాయం చేయాలని అఖిలపక్ష పార్టీలు, ప్రజా సంఘాల నేతలు డిమాండ్ చేశారు. మంగళవారం అఖిల పక్ష పార్టీల ఆధ్వర్యంలో సర్వజనాసుపత్రి ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిలపక్ష నాయకులు మాట్లాడుతూ బాలికపై దాడి చేసి హింసించడం దుర్మార్గంగా ఉందన్నారు. చట్టాలు బాగా తెలిసిన వారే ఇలాంటి చట్ట వ్యతిరేక, అమానవీయమైన చర్యలకు పాల్పడం సిగ్గు చేటుగా ఉందన్నారు. బాలికకు న్యాయం చేయాలని, దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. పోలీసులు స్పందిస్తూ 2 రోజుల్లోగా దాడి చేసిన వారిని అరెస్టు చేస్తామని హామి ఇచ్చారు. వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని తెలిపారు. బాలికకు మెరుగైన వైద్యం అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వం నుంచి న్యాయం జరిగేలా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. న్యాయం జరుగకపోతే ఎస్పీ బంగ్లా వద్ద ధర్నా చేస్తామని ఆందోళనకారులు తెలిపారు. ఈ ధర్నాలో సిపిఎం నగర 1 కమిటీ కార్యదర్శి వి.రామిరెడ్డి, జనసేన పార్టీ నగర అధ్యక్షుడు పొదిలి బాబురావు, సిపిఐ నగర నాయకులు బంగారు బాషా, టిడిపి నాయకులు ముక్తియార్, విజయశ్రీరెడ్డి, జానకి, స్వప్న, తేజస్విణి, కాంగ్రెస్ నాయకులు ఇమామ్ బాషా, ఆవాజ్ నాయకులు వలి, ఫక్రు వెంకటేశు, తాజ్, ఐఎంఎం బాషా, సిమెంటు పోలన్న, నాగేంద్ర, చిరంజీవి, సరస్వతి పాల్గొన్నారు.

అఖిలపక్ష పార్టీల నేతల ఆందోళన

ఆందోళన చేస్తున్న అఖిలపక్ష పార్టీల నాయకులు

ప్రాణం తీసిన క్రికెట్ బెట్టింగ్
కుమారుడి అప్పులు..
మనస్తాపంతో తండ్రి ఆత్మహత్య

ప్రజాశక్తి-గార్లదిన్నె

ఆత్మహత్య చేసుకున్న శేఖర్‌నాయకులు

క్రికెట్ బెట్టింగ్‌లు ఓ కుటుంబాన్ని చిన్నాభిన్నం చేశాయి. బెట్టింగ్‌ల కోసం తల్లిదండ్రులకు తెలియకుండా కుమారుడు అప్పులు చేయడం, ఈ అప్పులు తీర్చాలంటూ అప్పులిచ్చిన వారు పోలీసు స్టేషన్‌కు వెళ్లడంతో అవమానంగా భావించిన తండ్రి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గార్లదిన్నె మండల కేంద్రంలో మంగళవారం చోటు చేసుకున్న ఈ ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది. ఇందుకు సంబంధించి మృతుని కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... గార్లదిన్నెకు చెందిన ఎర్రాయపల్లి శేఖర్ నాయుడు(52) కుమారుడు మణికంఠ బెంగళూరులో ఓ ప్రయివేటు కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. ఇతను తండ్రికి తెలియకుండా క్రికెట్ బెట్టింగ్ కోసం రూ.40 లక్షల వరకు అప్పులు చేశాడు. మంగళవారం ఉదయం అప్పు ఇచ్చిన వారు గార్లదిన్నె పోలీస్ స్టేషన్లో అతనిపై ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు మణికంఠ తండ్రి శేఖర్‌నాయుడును పోలీసు స్టేషన్‌కు పిలిపించి మాట్లాడారు. కుమారుడు అప్పులు చేయడం, దాని కోసం తనను పోలీసు స్టేషన్‌కు పిలిపించడాన్ని శేఖర్‌నాయుడు అవమానంగా భావించాడు. పోలీసు స్టేషన్ నుంచి నేరుగా గ్రామ శివారులోని ఓ పొలానికి వెళ్లి అక్కడ చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పెద్దదిక్కును కోల్పోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. తన భర్త మృతికి కుమారినికి అప్పులిచ్చిన వారే కారణం అంటూ మృతుని భార్య కన్నీటి పర్యవంతం అయ్యింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

6, 7 తేదీల్లో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా మహాసభలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా మహాసభలు డిసెంబర్ 6, 7 తేదీల్లో కళ్యాణదుర్గం పట్టణంలో నిర్వహిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతురు పరమేష్ తెలిపారు. మంగళవారం కళ్యాణదుర్గం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణంలో ఎస్ఎఫ్ఐ మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా విద్యా రంగంలో ఉన్న సమస్యల పరిష్కారం కోసం 31వ జిల్లా మహాసభలో చర్చించనున్నట్లు తెలిపారు. జిల్లాలో కరువు నెలకొన్న దృష్ట్యా ప్రయివేట్ కార్పొరేట్ విద్యా సంస్థల్లో చదువుతున్న పిల్లల పూర్తి స్థాయి ఫీజులన్ని ప్రభుత్వమే భరించాలని మహాసభ సందర్భంగా డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు రూ. 10 వేలు ప్రత్యేక స్కాలర్‌షిప్ ఇవ్వాలన్నారు. సంక్షేమ హాస్టల్స్‌లో నాణ్యమైన భోజనం, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల సదుపాయం కల్పించాలన్నారు. పెరిగిన ధరలకు అనుకూలంగా మెస్ కాస్మోటిక్ చార్జీలు పెంచాలన్నారు. జగనన్న వసతి దీవెన విద్యా దీవెన కోసం జాయింట్ అకౌంట్ పేరుతో ఇప్పటికే విద్యార్థులను తల్లిదండ్రులను ప్రభుత్వం, బ్యాంకులో యాజమాన్యం వేధించడం ప్రారంభించారని తెలిపారు. జాయింట్ అకౌంట్ విధానాన్ని ప్రభుత్వం ఉపసంహరించురించుకోవాలన్నారు. నేరుగా తల్లి బ్యాంక్ ఖాతాల్లోకి డబ్బులు వేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. 6,7 తేదీల్లో కళ్యాణదుర్గంలో నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ 31వ జిల్లా మహాసభలకు విద్యార్థులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఆత్మస్థైర్యాన్ని కోల్పోవద్దు..
ఆత్మహత్యలతో సమస్యలు పరిష్కారం కావు : ఆర్‌డిఒ

ప్రజాశక్తి-ఉరవకొండ

రైతుల కుటుంబాలతో మాట్లాడుతున్న అధికారులు

రైతులు ఆత్మస్థైర్యాన్ని కోల్పోకుండా మనోనిబ్బరం కలిగి కుటుంబంతో సుఖ సంతోషాలతో జీవించాలని ఆర్‌డిఒ శ్రీనివాసులరెడ్డి పిలుపునిచ్చారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మండల పరిధిలోని ఆమిద్యాల గ్రామంలో అప్పుల భారంతో ఆత్మహత్యలు చేసుకున్న రైతు కుటుంబాలను స్థానిక నాయకులతో కలిసి మంగళవారం పరామర్శించారు. ఇందులో భాగంగా ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన గొంగడి రామాంజనేయులు కుమారుడు రమేష్, ఆత్మహత్య చేసుకున్న రామాంజనేయులు కుమారుడు సాయికృష్ణ కుటుంబ సభ్యులను పరామర్శించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతులు అప్పుల భారం తీర్చలేకపోతే ఆత్మహత్య చేసుకోవడం సరైన పద్ధతి కాదన్నారు. ఆత్మహత్యలకు పాల్పడితే మీ కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే స్థితులు ఉంటాయన్న విషయాన్ని గుర్తుంచుకుని కుటుంబంతో కలిసి సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీధర్‌మూర్తి, మండల వ్యవసాయ అధికారి శుభకర్, ఎస్ఐ వెంకటస్వామి, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జాయింట్ అకౌంట్ ఉత్తర్వులను రద్దు చేయాలి

ప్రజాశక్తి-గార్లదిన్నె

విద్యాదీవెన, వసతి దీవెన పథకాలకు తల్లి ఖాతాతోపాటు విద్యార్థి బ్యాంక్ అకౌంట్ ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను వెంటనే రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు తరిమెల గిరి మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రస్తుతం విద్యాదీవెన, వసతి దీవెన పథకాలు డబ్బులను ప్రారంభం నుంచి తల్లి ఖాతాలో జమ చేస్తున్నారన్నారు. ఇప్పుడు కొత్తగా విద్యార్థి ఖాతా కూడా కావాలని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. తద్వారా విద్యార్థులు, తల్లులు పనులను విడిచి పెట్టుకుని బ్యాంకుల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తుందన్నారు. కావున ప్రభుత్వం స్పందించి జాయింట్ అకౌంట్ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

విజయబాబును కలిసిన నల్లాని రాజేశ్వరి

విజయబాబును సన్మానిస్తున్న రాజేశ్వరి

అనంతపురం : ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం అధ్యక్షులు వి.విజయంబాబును ప్రముఖ రచయిత్రి, ఎన్ఆర్ఐ ఫౌండేషన్ ఛైర్‌పర్సన్ నల్లాని రాజేశ్వరి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా పర్యటనకు వచ్చిన ఆయనను స్థానిక రోడ్లు, భవనాల అతిథి గృహంలో కలిసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీశ్రీ కళావేదిక రాష్ట్ర అధ్యక్షుడు గుత్తా హరిసర్వోత్తమ నాయుడు పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ

నార్పల : ధర్మప్రచార వారోవత్సవాల పోస్టర్లను ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి మంగళవారం అనంతపురం ఆవిష్కరించారు. ఈనెల 26వ తేదీ నుంచి డిసెంబర్ 2వ తేదీ వరకూ గూగూడు కుళ్లాయిస్వామి దేవస్థానంలో ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి సాకేతపు శోభ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ శివశంకర్‌రెడ్డి, పాలకవర్గం సభ్యులు పాల్గొన్నారు.

రాజకీయ లబ్ధి కోసం మాట్లాడే వారి మాటలు నమ్మొద్దు

ప్రజాశక్తి-తాడిపత్రి

మాట్లాడుతున్న మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ జాన్సన్

రాజకీయ లబ్ధి కోసం మాట్లాడే వారి మాటలను ప్రజలు నమ్మొద్దని మాజీ మున్సిపల్ వైస్‌ఛైర్మన్ జాన్సన్ సూచించారు. మంగళవారం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రేషన్ గోడౌన్‌లో అధికారులు తనిఖీ చేస్తే తనకేం సంబంధమని ప్రశ్నించారు. మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి రాజకీయ కుట్రలు చేస్తున్నారన్నారు. ఇందులో భాగమే తనతోపాటు ఎమ్మెల్యే పెద్దారెడ్డికి అవినీతిని అంటగట్టి బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. అలాంటి ప్రయత్నాలను సాగనీయనన్నారు. ఆర్వోల మేరకు సరుకులను డీలర్లకు సప్లయ్ చేసే వరకూ తమ ట్రాన్స్‌పోర్ట్ బాధ్యత అన్నారు. గోడౌన్ స్థితిగతులు లావాదేవీలు, స్టాకుకు సంబంధించి ఏ సంబంధ తమకు లేదన్నారు. గోడౌన్ అధికారికి, తనకు ఏ విధమైన సంబంధాలు లేవన్నారు. అలాకాకుండా ఏమైనా సంబంధాలు ఉన్నట్లు రుజువు చేస్తే ఏ శిక్షకైనా సిద్ధమన్నారు. ఇప్పటికైనా ప్రభాకర్‌రెడ్డి వాస్తవాలను తెలుసుకుని మాట్లాడాలని హితవు పలికారు.

తొలిసారిగా కండరాల బలహీనతకు చికిత్స

ప్రాణాంతకమైన వ్యాధికి వైద్యంచేసిన కిమ్స్ సవీరా వైద్యులు



చికిత్స వివరాలను వెల్లడిస్తున్న కిమ్స్ సవీరా వైద్యులు

ప్రజాశక్తి-అనంతపురం

లక్షమంది జనాభాలో కేవలం 2 నుంచి 5 మాత్రమే వచ్చే అత్యంత అరుదైన, ప్రమాదకరమైన మయాస్థేనియా గ్రెవిస్ వ్యాధి కారణంగా సంభవించే కండరాల బలహీనతకు అనంతపురంలోని కిమ్స్ సవీరా ఆస్పత్రి వైద్యులు విజయవంతంగా చికిత్స చేసి ఓ మహిళను ప్రాణాపాయం నుంచి రక్షించారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆస్పత్రికి చెందిన సీనియర్ కన్సల్టెంట్ న్యూరాలజిస్టు డాక్టర్ కె. జాషువా కాలేబ్ వివరించారు. గుత్తికి చెందిన సుజాత (50)కు రెండేళ్ల క్రితం మయాస్థేనియా గ్రెవిస్ వ్యాధి నిర్ధారణ అయింది. అప్పటి నుంచి నెల, రెండు నెలలకు ఒకసారి వైద్యులను సంప్రదిస్తూ తగిన మందులు వాడుతుండేది. ఇలాంటి అత్యంత అరుదైన, ప్రమాదకరమైన వ్యాధి సోకిన సుజాతకు వాంతులు, విరేచనాలతో కడుపునొప్పి రావడంతో డయేరియా ఇన్ఫెక్షన్ సోకింది. దానివల్ల మయస్థేనిక్ క్రైసిస్ ఏర్పడింది. అదేసమయంలో తీవ్ర జ్వరం కూడా ఉండటంతో అనంతపురంలోని కిమ్స్ సవీరా ఆస్పత్రికి తీసుకొచ్చారు. రోగి ఆసుపత్రికి రాగానే ఆక్సిజన్ స్థాయి (ఎస్‌పీఓ2) తగ్గిపోయి 68 శాతానికి రావడంతో వెంటిలేటర్ మీద పెట్టామన్నారు. తర్వాత చికిత్స చేయడానికి ఉన్న అవకాశాలను బంధువులతో చర్చించి చికిత్స చేసినట్లు వివరించారు. ప్రస్తుతం ఆమె పూర్తిగా కోలుకున్నారన్నారు. అత్యంత ప్రమాదకరమైన, అరుదైన మయెస్థేనియా గ్రెవిస్ వ్యాధికి తొలిసారిగా చికిత్స చేసి కాపాడినందుకు బాధితురాలి బంధువులు ఆసుపత్రి సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

నేరాలు ఘోరాలు

యువతి ఆత్మహత్య

శ్రావణి (పాతచిత్రం)

రాయదుర్గం : విషద్రావకం తీసుకుని యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం రాయదుర్గంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. స్థానిక కోట ప్రాంతంలో నివసించే శ్రావణి (24) ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తోంది. ఈనేపథ్యంలో ఇంటికి వచ్చిన శ్రావణి వెండి ఆభరణాలు శుద్ధి చేసే ద్రావకం తాగి ఆత్మహత్య చేసుకుంది. ఈమెకు తరచూ కడుపునొప్పి వచ్చేది. ఎన్ని ఆసుపత్రుల్లో చూపించుకున్నా నయం కాలేదు. ఈనేపథ్యంలో నొప్పిని భరించలేని శ్రావణి ఇంట్లో ఎవరూ లేని సమయంలో వెండి ఆభరణాలు శుద్ధి చేసే ద్రావకం తాగి ఆత్మహత్యకు పాల్పడింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించి చేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

గుత్తి : పట్టణ శివారులోని అనంతపురం రోడ్డులో మంగళవారం ఓ గుర్తుతెలియని వృద్ధుని మృతదేహం లభ్యమైంది. దాదాపు 65 ఏళ్ల వయసున్న గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహం ఓ పెట్రోల్ బంకు వెనక ఉండటాన్ని గమనించిన స్థానికుల సమాచారం మేరకు పోలీసులు పరిశీలించారు. అనారోగ్యంతో మరణించి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఏడు దుకాణాల్లో చోరీ

గుత్తి : పట్టణంలోని గుంతకల్లుకు వెళ్లే రోడ్డు పక్కన ఉన్న ఆరు దుకాణాల్లో సోమవారం రాత్రి చోరీ జరిగింది. చంద్రశేఖర్, నాగరాజు కిరాణా దుకాణాలు, దాదు, మైనుద్దీన్ చెందిన మెడికల్ షాపులు, నాగేశ్వర్‌రెడ్డి హోటల్, శ్రీరాములు ఎరువుల దుకాణాల్లో కి గుర్తుతెలియని దుండగులు చొరబడి రూ.10వేల నగదు, సెల్‌ఫోన్‌తోపాటు విలువైన వస్తువులను దోచుకెళ్లారు. అలాగే గుత్తి ఆర్ఎస్‌లోని ఏపీఎస్‌పిడిసిఎల్ కార్యాలయం ఎదురుగా ఉన్న మణికంఠ హోటల్లో చోరీ జరిగింది. ఉదయం విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

గుత్తి : మున్సిపాలిటీ పరిధిలోని ఎస్ఎస్.పల్లిలో మంగళవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఓ ఇల్లు దగ్ధమైంది. ఎస్ఎస్.పల్లిలోని దుర్గమ్మ గుడి వద్ద లక్ష్మీదేవి ఇంట్లో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. దీంతో ఇంటిలోనే ఎలక్ట్రానిక్స్ వస్తువులు కాలి బూడిదయ్యాయి. సుమారు రూ.1.50 లక్షలు నష్టం వాటిలిందని బాధితురాలు వాపోయింది.

టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

మహిళకు కరపత్రం అందజేస్తున్న టిడిపి నాయకులు

అనంతపురం : టిడిపితోనే రాష్ట్రం అన్నివిధాలా అభివృద్ధి సాధ్యమని టిడిపి బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతుల లక్ష్మీనరసింహులు, నగర అధ్యక్షులు సిమెంట్ పోలన్న, నగర కార్యదర్శి చెరుకుతోట పవన్ తెలిపారు. మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్‌చౌదరి ఆదేశాల మేరకు మంగళవారం నగరంలోని 24వ డివిజన్‌లో అధ్యక్షులు బాబా ఫక్రుద్దీన్ ఆధ్వర్యంలో 'బాబు షూరిటీ, భవిష్యత్తు గ్యారంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా టిడిపి నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరించడంతోపాటు టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేయనున్న మినీ మేనిఫెస్టోను వివరించారు. ఈ కార్యక్రమంలో బూత్ ఇన్‌ఛార్జిలు, తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఉర్దూ అకాడమీ ఛైర్మన్ నదీమ్‌కు సన్మానం

నదీమ్‌కు బొకే అందజేస్తున్న మస్తాన్‌వలి

అనంతపురం : రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఛైర్మన్ నదీమ్‌అహ్మద్‌ను క్యాంప్ కార్యాలయంలో ఉర్దూ అకాడమీ డైరెక్టరీ సెక్రటరీ షేక్ మస్తాన్‌వలి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి గజమాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అకాడమీ సంబంధించిన అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా కులగణన

పుట్లూరు : మండలంలో పగడ్బందీగా కులగణన నిర్వహించాలని ప్రత్యేకాధికారిణి ఓబుళమ్మ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ యోగానందరెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన శిక్షణ తరగతుల్లో ఆమె మాట్లాడుతూ పగడ్బందీగా కులగణన చేయాలని సచివాలయ సిబ్బంది, వాలంటీర్లకు సూచించారు. ప్రతి ఒక్కరూ ఇంటింటికీ వెళ్లి ఏ కులం వారు ఎంతమంది ఉన్నారో నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ మోహన్‌కుమార్, ఇఒఆర్‌డి ఆనందప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది, వాలంటరీలు, తదితరులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం : సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు ఇంటింటికీ వెళ్లి కులగణన చేపట్టాలని ఎంపిడిఒ తేజోష్ణ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో కులగణన సర్వేపై గ్రామ సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, మండల స్థాయి సూపర్‌వైజర్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఒ అశోక్‌కుమార్, తహశీల్దార్ రమాదేవి, ఏఎస్ఓ పోతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతుకు న్యాయం చేయాలి

రాయదుర్గం : కనేకల్ మండలంలోని గంగులాపురం-కనేకల్ రహదారిపై ఉన్న వంతెన కూలిపోయి వరిధాన్యం నష్టపోయిన వారిని న్యాయం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా కమిటీ సభ్యులు మల్లికార్జున మంగళవారం ప్రకటనలో డిమాండ్ చేశారు. వంతెనపై ఐచర్ వాహనం వెళ్తుండగా ఒక్కసారిగా వంతెన కూలడంతో రైతు పండించిన వరి ధాన్యం తుంగభద్ర కాలువ నీటిలో కలిసిపోయిందన్నారు. దీంతో రైతుల దగ్గర నుంచి వరి ధాన్యాన్ని కొనుగోలు చేసిన వ్యాపారి, దలారులు, రైతులు తీవ్ర నష్టానికి గురయ్యారన్నారు. కావున ప్రభుత్వం వెంటనే స్పందించి బాధితులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

పలువురు వైసిపిలో చేరిక

ఉరవకొండ : మండలంలోని ఆమిద్యాల గ్రామానికి చెందిన టిడిపి నాయకులు మంగళవారం పట్టణంలోని వైసిపి కార్యాలయంలో యువనేత వై.ప్రణయ్‌రెడ్డి సమక్షంలో వైసిపిలో చేరారు. అమిద్యాల గ్రామానికి చెందిన టిడిపి నాయకులు గుడిసె ఆనంద్, లక్ష్మి, ఉడేగోలం సంజీవ్, బళ్లారి ఎర్రిస్వామి, అద్దాలు రామన్న తదితరులకు ప్రణయ్‌రెడ్డి వైసిపి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి నరసింహులు, కమ్మ, కురుబ కార్పొరేషన్ల డైరెక్టర్లు తేజోనాథ్, గోవిందు, మండల, రూరల్ కన్వీనర్ సుంకన్న, ఆమిద్యాల సర్పంచి శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు సెయింట్ ఆన్స్ విద్యార్థి

విద్యార్థిని అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయురాలు

అనంతపురం : కత్తిసాము పోటీల్లో సెయింట్ ఆన్స్‌కు చెందిన విద్యార్థి నవనీత్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు అనిలా సిస్టర్ తెలిపారు. ఈనెల 15వ తేదీన ఉంచి నంద్యాల జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో నవనీత్ అత్యంత ప్రతిభ కనబరిచినట్లు తెలిపారు. దీంతో డిసెంబర్‌లో మహారాష్ట్రలోని లాతూరులో జరిగే జాతీయ పోటీల్లో నవనీత్ పాల్గొననున్నట్లు తెలిపారు.

సంక్షేమ సారథిని మరోసారి ఆశీర్వదించాలి

శింగనమల మండలంలో మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

ప్రజాశక్తి-శింగనమల

నాలుగున్నరేళ్లుగా అన్నివర్గాల ప్రజల అభ్యున్నతికి కృషి చేస్తున్న సిఎం జగన్‌ను మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి అన్నారు. మంగళవారం మండలంలోని తరిమెల, చింతమేకలపల్లి గ్రామాల్లో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రభుత్వ పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వం మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చి ప్రజలను ఏవిధంగా మోసం చేసిందో గుర్తు చేసుకోవాలన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చిన అనంతరం సంక్షేమ పథకాలు ఏ విధంగా ఇంటి వద్దకే అందుతున్నాయో బేరీజు వేసుకుని ప్రజలు రానున్న ఎన్నికల్లో సిఎం జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, సింగిల్‌విండో ప్రెసిడెంట్ బొమ్మన శ్రీరామిరెడ్డి, వైసిపి యువ నాయకుడు ఆలూరు ఎర్రిస్వామిరెడ్డి, ఎపి నాటక అకాడమీ ఛైర్‌పర్సన్ ప్రమీల, నాయకులు కంచిరెడ్డి భాస్కర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, బాల్‌రెడ్డి, సర్పంచి ఓబులేసు, చెన్నకేశవులు, ఎన్‌వి.నారాయణ, ప్రజాప్రతినిధులు, మండల నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

గుత్తిలో ఎమ్మెల్యే వైవిఆర్. కుమార్తెను గజమాలతో సత్కరిస్తున్న నాయకులు, కార్యకర్తలు

'వై ఎపి నీడ్స్ జగన్'లో నాయకులు

ఉరవకొండ : స్వార్థ రాజకీయాల కోసం పాకులాడే టిడిపి నాయకులు చూసి మోసపోవద్దని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. మంగళవారం విడపనకల్లు సచివాలయం-2లో 'ఆంధ్రప్రదేశ్ కు జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమం నిర్వహించారు. ముందుగా దివంగత సిఎం రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి, జడ్పిటిసి హనుమంతు, ఇఒఆర్‌డి సత్యబాబు, ఉప సర్పంచి ఓబుళమ్మ, పంచాయతీ సెక్రటరీ బాషా, నాయకులు కరణం భీమరెడ్డి, రామాంజనేయులు, రమేష్, సుంకన్న, దేశాయ్ సిద్ధార్థ, గిరిబాబు, షేక్షావలి, శ్రీరాములు, కుళ్లాయిస్వామి, రామాంజనేయరెడ్డి, రోజా, గాజుల చిన్న వెంకటేశులు, ఉమాశంకర్, ఉలిగన్న, గోపాలకృష్ణ, యువరాజు, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి : పేదల అభివృద్ధి కోసం సిఎం జగన్ ప్రభుత్వం చేతనందిస్తోందని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 9,24వ వార్డుల్లో మంగళవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ డి.మున్నూరుబీ, ఎంపీపీ జి.విశాలాక్షి, కబడ్డీ సంఘం జిల్లా అధ్యక్షులు, వైసీపీ నేత సిబి మంజునాథ్‌రెడ్డి, గుంతకల్లు మున్సిపల్ వైస్‌ఛైర్‌పర్సన్ సిబి నైరుతీరెడ్డి, గుత్తి వైస్ ఛైర్‌పర్సన్‌లు బి.వరలక్ష్మి, బి.పద్మలత, మార్కెట్ యార్డ్ ఛైర్‌పర్సన్ సి.సునీలాయాదవ్, కౌన్సిలర్లు బి.లక్ష్మిరాణి, డి.పుష్పావతి, నాయకులు బి.శ్రీనివాస్‌రెడ్డి, డి.హుస్సేన్‌పీరా, బి.రమేష్‌రెడ్డి, జీపు రమణ, అబ్దుల్ వహాబ్, రంగాయాదవ్, బోయగడ్డ రాము, గురు ప్రసాద్, మల్లయ్య యాదవ్, ఎంసి.రంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

బొమ్మనహాల్ : మండలంలోని శ్రీధర్‌గట్ట గ్రామాన్ని రూ.5కోట్లతో అభివృద్ధి పనులు చేసినట్లు సర్పంచి యోగేశ్వరరెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని శ్రీధర్‌గట్ట గ్రామంలో 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో సుమారు రూ.5కోట్లతో సీసీ రోడ్లు, కొత్త ఆసుపత్రి నిర్మాణం, జెడ్పీ హైస్కూల్ కాంపౌండ్ వాల్ నిర్మాణం, అంగన్‌వాడీ భవన నిర్మాణం, ఎన్‌ఆర్‌జిఎస్ రస్తా రోడ్డు, మురుగు కాలువ నిర్మాణం, డ్రెయినేజీ నిర్మాణం, నాడు-నేడు పనుల కింద పాఠశాల కాంపౌండ్ వాల్ నిర్మాణం, అదనపు గదులు, ఆర్‌బికెతోపాటు అనేక పనులు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఉప ఎంపిపి రమేష్, వైసిపి నాయకులు రామాంజనేయులు, చంద్రశేఖర్‌రెడ్డి, లోకేష్, రామకృష్ణ, వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

రాయదుర్గంలో జెండాను ఆవిష్కరిస్తున్న వైసిపి నాయకులు

రాయదుర్గం : పట్టణంలోని 8వ సచివాలయంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొరాళు శిల్ప అధ్యక్షతన 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా సంక్షేమ పథకాల లబ్ధి వివరాలు తెలిపే నోటీసు బోర్డుతోపాటు వైసిపి జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శిల్పతోపాటు వైసిపి రాష్ట్ర రైతు విభాగ కార్యదర్శి గౌని ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ సిఎం జగన్ అధికారంలోకి వచ్చాక అనేక రకాల సంక్షేమ పథకాలను తీసుకొచ్చి ప్రజలకు మేలు చేకూరుస్తున్నారన్నారు. కావున మరోసారి సిఎం జగన్‌ను ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వార్డు సభ్యులు లావణ్య, అజయ్, మున్సిపల్ మేనేజర్ ప్రసాద్, వైస్‌ఛైర్మన్లు శ్రీనివాస్‌యాదవ్, వలిబాషా, వార్డు సభ్యులు, కో ఆప్షన్ మెంబర్లు అరవా శివప్ప, ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, హౌసింగ్ బోర్డ్ డైరెక్టర్ శ్రీనివాసులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి-కుందుర్పి

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని సర్పంచి గోవిందమ్మ ఓబన్న తెలిపారు. ఈమేరకు మంగళవారం మండలంలోని మలయనూరు దళిత కాలనీలో రూ.20 లక్షల ఎంపీపీ నిధులతో నిర్మించిన సీసీ రోడ్లను సర్పంచి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20ఏళ్లుగా దళిత కాలనీవాసులు సీసీ రోడ్లు లేక నానా ఇబ్బందులు పడుతున్న దుస్థితిని గమనించిన మంత్రి ఉషశ్రీ చరణ్ సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.50 లక్షల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకుడు సుదర్శన్‌రెడ్డి, ఎంపిపి కమలా నాగరాజు, జడ్పిటిసి రాధాస్వామి, కాంట్రాక్టర్ వలసమూర్తి, మాజీ సర్పంచి శివశంకర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రామాంజనేయులు, సచివాలయ ఇంజనీర్, మలయనూరు గ్రామ ప్రజలు వైసిసి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీసీ రోడ్లను ప్రారంభిస్తున్న సర్పంచి గోవిందమ్మ ఓబన్న

కూల్చిన పశువుల ఆసుపత్రి పరిశీలన

ప్రజాశక్తి-బొమ్మనహాల్

మండలంలోని గోవిందవాడ గ్రామంలో కూల్చిన పశు వైద్య భవనాన్ని కళ్యాణదుర్గం ఆర్‌డిఒ రాణీసుస్మిత మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ భవనాన్ని అనుమతి లేకుండా కూల్చివేయడం చట్టపరంగా నేరం అన్నారు. ఘటనపై పూర్తి ఆధారాలను సమర్పించాలని తహశీల్దార్ శ్రీనివాసులును ఆదేశించారు. ఇందుకు తహశీల్దార్ స్పందిస్తూ ప్రయివేటు స్థలంలో భవనాన్ని నిర్మించారని తహశీల్దార్ తెలిపారు. ఘటనపై పూర్తి వివరాలను ఆర్‌డిఒ కార్యాలయానికి పంపాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పశువైద్య జేడీ ఉరవకొండ వెంకటేశ్వర్లు, ఇన్‌ఛార్జి విఆర్‌ఒ రామన్న, పంచాయతీ ఇన్‌ఛార్జి కార్యదర్శి లోకేష్, సచివాలయ, రెవెన్యూ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

ప్రజలతో మాట్లాడుతున్న ఆర్‌డిఒ రాణిసుస్మిత

పెద్దాసుపత్రి వద్ద అన్నదానం

అనంతపురం : నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు పుట్టినిల్లు ఆశ్రమం ఆధ్వర్యంలో మంగళవారం అనంతపురంలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు ఛైర్‌పర్సన్ ఎస్.నిర్మలమురళి మాట్లాడుతూ ట్రస్టు సభ్యులు, ప్రవాస భారతీయులు శ్రీనివాసులు కుమారుడు వికాస్ పుట్టినరోజు సందర్భంగా అన్నదానానికి సహకరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు సుబ్రమణ్యం, ఓబుళపతి, కిష్టప్ప, సుబ్బారావు, నబీరసూలు, వెంకటరమణ, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం చేస్తున్న నిత్యసురభి ట్రస్టు సభ్యులు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నార్పల : మండల పరిధిలోని కూతలేరు వంక సమీపంలో విద్యుత్ స్తంభాలు, విద్యుత్ లైన్లు మార్పు చేస్తున్నందున బుధవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్ ఏఈ రఘునాథబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు ఈ అంతరాయాన్ని గమణించి సహకరించాలని కోరారు.

శింగనమల ఎంఎల్ఎస్ పాయింట్ తనిఖీ

అనంతపురం : అనంతపురము ప్రాంతీయ నిఘా, అమలు అధికారి మునిరామయ్య ఆదేశాల మేరకు మంగళవారం శింగనమల మండల కేంద్రంలోని ఎంఎల్ఎస్ పాయింట్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా స్టాకు నిల్వలు, తూకాల్లో వ్యత్యాసాలు రావడంతో తదుపరి చర్యకు నివేదికలు తయారు చేసినట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ అధికారులు వి.వెంకటరమణ, రవీంద్రనాథ్, తదితరులు పాల్గొన్నారు.

కంపచెట్లు తొలగింపు

ఉరవకొండ : పట్టణంలోని హమాలీ కాలనీలో రోడ్డుకి ఇరువైపులా అడ్డంగా ఉన్న కంపచెట్లను వైసిపి నాయకులు మంగళవారం జెసిబిలతో తొలగించారు. కాలనీలో రోడ్డు కనపడకుండా కంపచెట్లు పెరగడం వల్ల రాకపోకలకు ఇబ్బంది కరంగా ఉందని స్థానికులు కోరగా తొలగించినట్లు ఉపసర్పంచి వన్నప్ప, గ్రామ కార్యదర్శి గౌస్ సాహెబ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు బసవరాజు, పచ్చి రవి, వేమన్న, వైసీపీ నాయకులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

సోషల్ మీడియా ప్రతినిధులకు అండగా ఉంటాం

విప్ కాపు రామచంద్రారెడ్డి

రాయదుర్గం : పార్టీకోసం పని చేస్తునన ప్రతి వైసిపి మీడియా ప్రతినిధికీ అండగా ఉంటామని విప్ కాపు రామచంద్రారెడ్డి భరోసా ఇచ్చారు. మంగళవాంర డి.హీరేహాల్‌లో వైసిపి సోషల్ మీడియా నియోజకవర్గ ప్రతినిధుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వైసిపి సోషల్ మీడియా ప్రతినిధీ 2024 ఎన్నికల్లో తిరిగి పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

అయ్యప్ప భక్తులకు నిత్యాన్నదానం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

శ్రీ అనంత అయ్యప్ప అన్నదాన సేవా సమితి ఆధ్వర్యంలో అయ్యప్ప మాల వేసిన భక్తులకు నిత్య అన్నదానం నిర్వహిస్తున్నట్లు సమితి సభ్యులు తెలిపారు. అయ్యప్ప మాల దారులకు 15 ఏళ్లుగా అనంతపురం చెరువుకట్టపై అన్నదానం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నవంబర్ 21 నుంచి డిసెంబర్ 31 వరకు ఈ అన్నదాన కార్యక్రమం జరుగుతుందన్నారు. సుమారు 1500 నుంచి 2000 మంది అయ్యప్ప మాలదారులకు ప్రతి రోజు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అయ్యప్ప మాలదారులు గమనించి అన్నదాన కార్యక్రమంలో పాల్గొనాలని అన్న ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.